క్లుప్తంగా

'సద్భావన' ఆధ్వర్యంలో రంజాన్ తోఫా



రంజాన్ తోఫా అందిస్తున్న పూర్ణ

అగనంపూడి: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 85వ వార్డు పెదమడక మసీదులో నిర్వహించిన కార్యక్రమంలో సద్భావనా సేవా సంఘం 50 మంది నిరుపేద ముస్లింలకు బియ్యం, బెల్లం, సేమియా, జీడిపప్పు, నూనెలను అందించింది. సద్భావనా సేవాసంఘం ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) ముస్లిం కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుడే సుశీలా గజేంద్రరావు, నాయకులు పట్టా రామకృష్ణ, ముస్లిమ్ పెద్దలు, మాస్కడ్ ఈ అబూబాకర్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు షేక్ మీర్ మొహుద్దీన్, అబ్దుల్ రహీమ్, వాలీభాయ్, షేక్ హుస్సేన్, సిలార్, సలీమ్ పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకువెళ్లిన ఆటో



కాలువలో ఆటో

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు పక్కన నిలబెట్టిన ఆటో, కదిలి పక్కనున్న కాలువలోకి వెళ్లిపోయింది. ఆటో డ్రైవర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక నుంచి షీలానగర్ వైపు వెళ్తున్న ఆటోలో డ్రైవర్‌తో పాటు అతని భార్య ఉన్నారు. ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ దాటిన తర్వాత, డ్రైవర్ భార్యను దించి, తాను దిగి వేరే పనిలో ఉన్నాడు. ఆ సమయంలో ఆటోకు హ్యాండ్ బ్రేక్ వేయకపోవడంతో కదిలి, పక్కనున్న కాలువలోకి జారిపోయింది. ఆటోలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్, గన్నవరం–ముస్తాబాద–గుణదల సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. కింద పేర్కొన్న రైళ్లు ఆయా తేదీల్లో రెగ్యులర్ మార్గం నిడదవోలు–ఏలూరు–విజయవాడల మీదుగా కాకుండా వయా నిడదవోలు–భీమవరం టౌన్– గుడివాడ–విజయవాడల మీదుగా నడుస్తాయి.

- ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖలో బయలుదేరే విశాఖపట్నం–గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్..
- ఈ నెల 21న ధన్‌బాద్‌లో బయలుదేరిన ధన్‌బాద్–అలెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్..
- ఈ నెల 21న టాటానగర్‌లో బయలుదేరే టాటానగర్–బెంగళూరు(12889) ఎక్స్‌ప్రెస్
- ఈ నెల 22న హతియాలో బయలుదేరే హతియా–బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

టీఎన్‌టీయూసీ విశాఖ ప్రధాన కార్యదర్శిగా నాగార్జున



అగనంపూడి: టీఎన్‌టీయూసీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా కొరాయి నాగార్జున నియమితులయ్యారు. పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా నక్కా లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శిగా అగనంపూడికి చెందిన డాక్‌యార్డ్ ఉద్యోగి కొరాయి నాగార్జునను నియమించినట్లు ప్రకటించారు.

పన్ను వసూళ్లు అదుర్స్

- ఐదు శాతం డిస్కౌంట్‌కు అనూహ్య స్పందన
- మూడు వారాల్లో రూ.9 కోట్లకు పైగా వసూలు



జీవీఎంసీ కౌంటర్ వద్ద పన్ను చెల్లింపుదారులు

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో పన్ను వసూళ్లు పెరిగాయి. ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే ఆస్తి పన్ను చెల్లించేవారికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఐదు శాతం డిస్కౌంట్‌తో చాలామంది చెల్లింపుదారులు ముందుగానే చెల్లించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. గత నెల ప్రకటించిన వడ్డీ మినహాయింపుతో తమ పన్నులను ఎరియర్స్‌తో సహా చెల్లించిన పన్ను చెల్లింపుదారులు తాజాగా ఇచ్చిన ఐదు శాతం డిస్కౌంట్‌తో ముందస్తు చెల్లింపులకు ముందుకొస్తున్నారు. ఈ డిస్కౌంట్ సౌకర్యం మరో పది రోజులే ఉండటంతో జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలోని సౌకర్యం కేంద్రం వద్ద పన్ను చెల్లింపుదారులు క్యూ కడుతున్నారు.

1,12,214 అసెస్‌మెంట్లు గల గాజువాక జోన్‌లో ఏడాదికి ఆస్తి పన్ను రూ.62 కోట్లు వసూలు కావాలి. ప్రభుత్వం ప్రకటించిన డిస్కౌంట్ కారణంగా కౌంటర్ వద్దే ప్రతిరోజు రూ.15 నుంచి 20 లక్షల వరకు ఆస్తి పన్నులు వసూలవుతున్నట్టు జోనల్ రెవెన్యూ విభాగం అధికారులు పేర్కొంటున్నారు. గడిచిన మూడు వారాల్లో రూ.9 కోట్లకు పైగా వసూలైనట్టు తెలిపారు.

> **అందరూ సద్వినియోగం చేసుకోవాలి**
>
> డిస్కౌంట్ సౌకర్యం ఈ నెల 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముందుగా పన్ను చెల్లించడం వల్ల నగరాభివృద్ధికి కృషి చేసినవారవుతారు.
>
> – సీహెచ్.రామనారాయణ, రెవెన్యూ ఆఫీసర్, గాజువాక జోన్

గత ప్రభుత్వ నిర్వాకం వల్లే అదనపు భారం

- ఆ సవాళ్లను అధిగమించి ప్రగతి పథంలో రాష్ట్రం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: గత టీడీపీ ప్రభుత్వం నిర్వాకం వల్లే రాష్ట్రంపై అదనపు భారం పడిందని, అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగిందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆ సవాళ్లను అధిగమించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారన్నారు. 69వ వార్డులో శుక్రవారం సుమారు కోటి రూపాయల పనులకు సంబంధించి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను నిర్వహించారు. రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డితో కలిసి శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు కేవలం రాష్ట్రాన్ని దోచుకోవడానికే సమయమంతా కేటాయించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఒక్క అభివృద్ధి పని చేసిన పాపాన పోలేదన్నారు. ఆ పరిస్థితిని చక్కదిద్దిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించారన్నారు. వేలాది కోట్ల రూపాయలతో రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు.

ఓర్వలేకనే అసత్య ఆరోపణలు

అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రం దూసుకుపోతుంటే చంద్రబాబు అనుకూల ప్రచార చానళ్లు, పత్రికలు అసత్యాలుగా చూపుతూ ప్రజలను మభ్యపెడుతున్నాయన్నారు. చంద్రబాబు కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజానీకం జగన్ వెంటే ఉన్నారని అన్నారు. షీలానగర్ పంప్ హౌస్ వద్ద, వెంకటేశ్వర కాలనీ, తుంగ్లాంలో రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీ వద్ద వీధి దీపాలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు, ఏపీ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోగాది సన్యాసిరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, నాయకులు విరోతి రాము, జీవన్ బాబు, వీర్రాజు, సాలాపు వెంకట్రావు, మళ్లా కుమార్, కమరున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

విపత్కర వేళ అందించిన సేవలు అమూల్యం



సేవలందించిన వారిని సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

పెదగంట్యాడ: కరోనా వంటి క్లిష్ట సమయంలో వైద్యులతో పాటు మెడికల్ దుకాణాల యజమానులు, స్వచ్ఛంద సంస్థలతో పాటు వలంటీర్లు అందించిన సేవలు ఎనలేనివని బ్రహ్మకుమారి స్వాతి అన్నారు. యారాడలో వైద్య సేవలందించిన వారితో పాటు సేవాసంస్థల ప్రతినిధులను బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. ఆమె మాట్లాడుతూ త్యాగభావం, మనోధైర్యంతో సేవలందించిన అందరూ అభినందనీయులన్నారు. అటువంటి వారిని సత్కరించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఆర్ఎంపీ వైద్యుడు సన్నీని, వలంటీర్లను, మెడికల్ దుకాణాల యజమానులను, యారాడ హెల్పింగ్ యూత్ సభ్యులను సత్కరించారు. సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల సహకారం అవసరం



మహిళా పోలీసులకు సూచనలు ఇస్తున్న సీఐ రాము

పెదగంట్యాడ: నేరాల నియంత్రణలో మహిళాపోలీసులు సహకారం అందించాలని న్యూపోర్టు సీఐ సువ్వారి రాము కోరారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని సూచించారు. న్యూపోర్టు పోలీస్ స్టేషన్ ఆవరణలో సచివాలయ మహిళా పోలీసులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు తమకు అందజేయాలని కోరారు. మండలంలోని సచివాలయాల పరిధిలో ఎక్కడైనా, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. మహిళలను వేధించే ఆకతాయిలపై చర్యలకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు రాజీవ్ మార్గ్‌లోని కొండవాలు ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలని ఆ ప్రాంతవాసులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కోరారు. ఈ మేరకు 65వ వార్డు వైఎస్సార్‌సీపీ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో మహిళలు ఆయన్ను శుక్రవారం కలసి, వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాజీవ్‌మార్గ్‌లోని కొండవాలు ప్రాంతాల్లో మెట్లు ఛిద్రమయ్యాయని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, కాలువలు సక్రమంగా లేవని విన్నవించారు. వీధి దీపాలు వెలగడం లేదని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు నాయకులు మద్దాల అప్పారావు, లోకనాథరావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, పప్పల పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం



పెదగంట్యాడ జంక్షన్‌లో ప్రచారభేరి నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

పెదగంట్యాడ: ఉక్కు పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు అన్నారు. పెదగంట్యాడ కూడలిలో శుక్రవారం వామపక్ష పార్టీల ప్రచారభేరి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, కేఎం శ్రీనివాస్, వై.శ్రీనివాస్, జి.ఆనంద్, కొవిరి అప్పలరాజు, విష్ణుమూర్తి, కణితి అప్పలరాజు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇమ్రాన్, గౌస్ తదితరులు

గాజువాక: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు నిర్వహించనున్న ప్రార్థనలకు బీసీ రోడ్‌లోని ఈద్గా మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ శుక్రవారం ఆ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి సహకారంతో ఈద్గా మైదానానికి రూ.45 లక్షలతో ఫ్లోరింగ్ పనులను నిర్వహించినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో మైదానాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. వారికి గాజువాక ముస్లింల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు సర్దార్, చాంద్ బాషా, సాహిద్, చోటు, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ సందర్భంగా ముస్లిమ్ పెద్దలను సత్కరిస్తున్న సాయి మందిరం ప్రతినిధులు

అగనంపూడి: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అగనంపూడి సాయిబాబా ఆలయంలో శుక్రవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీద్ ఈ అబూబర్ అధ్యక్షుడు మీరా మొహిద్దీన్ మాట్లాడుతూ మతాల ప్రమేయం లేకుండా హిందూ, ముస్లింలు సఖ్యతతో సోదర భావంతో మెలుగుతూ దేశ సమగ్రతను కాపాడుకుంటున్నామన్నారు. సాయి మందిర కమిటీ ప్రతీ ఏటా ఇఫ్తార్ విందు ఏర్పాటు సంప్రదాయంగా కొనసాగడం సంతోషంగా ఉందన్నారు.

అనంతరం మీరా మొహిద్దీన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.వి.రమణారెడ్డి, నాయకులు బి.సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు డి.వ్యాసశర్మ, జి.శంభుడు, పి.సత్యనారాయణ, సత్యవతి, లీలావతి, పంకజం తదితరులు పాల్గొన్నారు.

గాయత్రికి బాలచిత్ర కళా అవార్డు



గాయత్రిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ విద్యార్థిని యు.గాయత్రి శ్రీదకు జాతీయ స్థాయి బాలచిత్ర కళా అవార్డు లభించింది. ఏపీ ట్రాన్స్‌కోలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యు.ప్రభాకర్, విమల దంపతుల కుమార్తె గాయత్రి డీపీఎస్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఇటీవల విజయవాడకు చెందిన డ్రీమ్ చిల్డ్రన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న గాయత్రి అద్భుత ప్రతిభ కనబరిచి అవార్డును సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీర్ కుమార్ పాండే గాయత్రిని, ఆమెకు శిక్షణ ఇచ్చిన ఆర్ట్ టీచర్ దానయ్యను అభినందించారు.

పదేళ్లు దాటితే ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

మహారాణిపేట: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటితే కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ రెండో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు ద్వారా బ్యాంక్ ఖాతా, సిమ్ కార్డ్, వివిధ ఉపకార వేతనాలు, ఆదాయపు పన్ను, బ్యాంకు రుణాలు, ఒక దేశం ఒక రేషన్ కార్డు కింద దేశంలో ఎక్కడైనా సరుకులు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను నవీకరించిన ఆధార్‌తో పొందవచ్చని ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు.

దీనికోసం ఏదైనా అడ్రస్ ప్రూఫ్ , ఐడెంటిటీ ప్రూఫ్‌తో దగ్గరలోని ఆధార్ కేంద్రం, మండల ప్రధాన కేంద్రంలోని సచివాలయం, బ్యాంకులు, పోస్ట్ ఆఫీస్, వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో గాని అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు.

జూన్ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆధార్ అప్‌డేట్ ఉచితమని పేర్కొన్నారు. అడ్రస్ ప్రూఫ్ లేనట్లయితే వారి సచివాలయం లో 20/- చెల్లించి సర్టిఫికెట్ పొందవచ్చని తెలిపారు . జిల్లాలో ఇంకా ఆధార్ అప్ డేట్ చేసుకోని వారు సుమారు 4 లక్షల మంది ఉన్నారన్నారు. ఆధార్ అప్ డేట్‌కు సంబంధించిన సమాచారం, వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1947ను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్డీవో పూర్ణిమా దేవి, జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, యూఐడీఏఐ రీజినల్ మేనేజర్ గిరిధర్, వైద్య ఆరోగ్య శాఖ, బ్యాంకింగ్, పోస్టల్,ఎడ్యుకేషన్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

ముడిసరకు నిలిపివేత ప్రైవేటీకరణలో భాగమే..



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమకు ముడిసరకును అందించి పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా సంస్థను నడపాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 799వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకుడు డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్లాంట్‌ను ఆపేయాలనే ఆలోచనతోనే ముడిసరుకు అందించకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే పలు ముఖ్య విభాగాలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ముడి సరకు అందించకుండా కార్మికులకు పని లేకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనని, దీనికి యాజమాన్యం కూడా సహకరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకోవాలని, ప్రజా ఉద్యమాలకు విలువను ఇస్తూ ప్రజలకు అండగా ఉండాలని కోరారు. లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పనితీరుపై సర్వత్రా హర్షాతిరేకాలు

- వైఎస్సార్‌సీపీ నాయకులు వెల్లడి
- జోరుగా 'జగనన్నే మా భవిష్యత్తు'



ఎమ్మెల్యే నాగిరెడ్డికి ప్రజా మద్దతు పుస్తకాలను అందజేస్తున్న మంగరాజు, శ్రీను

పెదగంట్యాడ: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్‌లోవలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో వార్డు కమిటీతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వంశీరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో చేపట్టిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పనితీరుపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు.

65వ వార్డులో..

జీవీఎంసీ 65వ వార్డు కాకతీయ లోవలో కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు స్టిక్కర్లను అతికించారు. పెద్దింటి మంగునాయుడు, రమణ, అర్జున్, సతీష్ పాల్గొన్నారు.

మద్దతు పుస్తకాల అందజేత : 64వ వార్డు అన్ని సచివాలయాలకు సంబంధించి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను తెలిపారు. ఈ మేరకు ప్రజా మద్దతు పుస్తకాలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని వార్డుల కంటే ముందుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ పార్టీ కార్యక్రమాలను ఇదే ఉత్సాహంతో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ హరీష్, రాజాన వెంకటరావు, గొందేశి మహేశ్వరరెడ్డి, సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



లబ్ధిదారునికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందిస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 70వ వార్డు చట్టివానిపాలెంలో పథకాలు పొందుతున్న లబ్ధిదారులను శుక్రవారం ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకాలను మంజూరు చేయడానికి అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి భావించారని, పార్టీలు, కులాలు, మతాలతో సంబంధం లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన్ను మరోసారి దీవించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఉరుకూటి చందు, నాయకులు చట్టి అప్పలరాజు, అప్పలనాయుడు, సాధురావు, పైడిరాజు, వాణి, సంతోషి, కనక తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపే సివిల్ సర్వీసెస్ డే



ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ

మహారాణిపేట : ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి, వారిలో స్ఫూర్తి నింపేందుకే జాతీయ సివిల్ సర్వీసెస్ రోజును ప్రతి ఏడాది ఏప్రిల్ 21వ తేదీన జరుపుకుంటున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 16వ జాతీయ సివిల్ సర్వీసెస్ రోజును ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ పబ్లిక్ సర్వీస్ విభాగాల్లో నిమగ్నమై ఉన్న అధికారుల పనిని గుర్తించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న దీనిని పాటిస్తారన్నారు. అనంతరం 16వ జాతీయ సివిల్ సర్వీసెస్ రోజు సందర్భంగా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగుల చేత జాయింట్ కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణ మూర్తి, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

24న 'జై భారత్ సత్యాగ్రహ సభ'

పెదగంట్యాడ: ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో ఈ నెల 24న విజయవాడలో నిర్వహించనున్న జై భారత్ సత్యాగ్రహ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ గాజువాక సమన్వయకర్త జె. ముత్యాలు కోరారు. సభకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కొవిరి కోదండరావు, ఎస్.అప్పారావు, భూలోక, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

వారణాసి రైలుకు మరిన్ని కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల అనూహ్య స్పందన నేపథ్యంలో విశాఖ–బనారస్–విశాఖ మధ్య నడుస్తున్న వీక్లీ స్పెషల్ రైలుకు ఈ నెల 26 నుంచి 1–సెకండ్ ఏసీ , 1–థర్డ్ ఏసీ కోచ్‌లను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

గౌహతి–సికింద్రాబాద్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

గౌహతి–సికింద్రాబాద్–గౌహతి మధ్య నడుస్తున్న రైలుకు ఈ నెల 27నుంచి నుంచి ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం తెలిపారు.